

## సంపెంగలు

**కృష్ణమూర్తిని** ఎవరయినా యూనిఫారంలో మొట్టమొదటి సారిగా చూశారంటే 'ఎంతబాగున్నా డీ టికెట్ కలక్టర్' అని అనుకోకుండ ఉండలేరు. ఎర్రటి శరీర చాయ. ఎత్తుకుతగ్గ లావు. బిగువైన కండరాలు. వెడల్పాటి మెరిసే కళ్ళు. ఒకే మారు చూసినా అతన్ని ఇట్టే గుర్తుంచుకుంటారు. తక్కువగా మాట్లాడటం, ఎక్కువగా పని చేయటం మూర్తి లక్షణం. అందాల హరివిల్లు, బాణం శ్రీరామచంద్రునకు ఎంతో— జార్మానాల నొడ్డించే ఎక్స్‌ప్రెస్ ఫేరు బుక్కూ, పెన్సిలు అంత మూర్తికి. దుష్టగ్రహాలపై

ఎక్కుపెట్టటానికి తన, పరా అంటూ ఉండవు మూర్తికి. అర్హతలు లేకుండా రైలుబండిలో ప్రయాణిస్తున్న ఎవ్వరయినా సరే భారతమాత ఆదాయానికి, పురోగతికి శత్రువేనని అత నుద్దేశం. డ్యూటీలో తు.చ. చట్టాలను తప్పకుండ పాటిస్తాడే కాని, వాటిల్లోని అలుసు సెలుసులను ఆసరాగా తీసుకుని అక్రమపు టావందార్ని జార్రుకోడు. ఒక విధంగా చూస్తే మూర్తి సేవింగ్సు నేటికిరైల్వేలో 'ముక్కుకుసూటిగపోయేవ్యక్తి'అన్నపేరు మాత్రమే."మడి గట్టుకుని కూర్చుంటే ఏమి బావు కుంటానోయ్!" అంటూ హేళనగా సహచరుల వుంగరాళ్ళ చేతులు చాలా సార్లు హెచ్చరించినయి.

గోదావరిఎక్స్‌ప్రెస్ రాకతో విజయవాడ ప్లాట్‌ఫారంలో ఆలజడి బయలుదేరింది. ట్రెయిన్ దిగి స్లీపర్ కోచ్ ముందు నుంచున్నాడు మూర్తి డ్యూటీ ఎప్పుడు దిగిపోదామాన్నట్లు రిలీవర్ కోసం చూస్తూ. లైసెన్సు కూలీల అరుపులు, పుష్ ట్రాలీల కీచు శబ్దాలు మరింత బీభత్సంగవినిపిస్తున్నయి. రిఫ్రెష్‌మెంట్ స్టాల్సు కిక్కిరిసి పోతున్నయి. సాంబార్, పెరుగు పొట్లాల అమ్మకం గజిబిజి దుకాణంలా అస్తవ్యస్తంగా ఉంది. వార్ కమాండెంట్ ఆర్డర్సులా మైకులో ఎనౌన్సుమెంట్లు ఖంగ్ మంటున్నాయి. జనం రద్దీలోంచి దూసుకుంటూ స్లీపర్ కోచ్ ముందు కొచ్చాడు రామన్. చార్జి తీసుకున్నాడు మూర్తినుంచి. చార్టు చెక్ చేసుకుంటూ, కొత్తగా బెర్తు ఎలాట్ మెంట్‌లు సరిచూసుకుంటున్నాడు రామన్. బెల్లం చుట్టూ మూసుకున్న చీమల్లా బెర్తులకోసం పీక్కు తింటు న్నారు ప్రయాణీకులు రామన్ని. రెపరెపలాడుతున్నాయి వారి చేతుల్లో కరెన్సీ నోట్లు.

సెలవు తీసుకోబోతున్న మూర్తిని ఆగమన్నట్లు చూశాడు రామన్.

"చెప్పడం మరిచాను—మీ పాపకు హై ఫీవర్. మోషన్సు. సీతారత్నం హాస్పిటల్లో ఎడ్మిట్ చేశాము." ఆత్రుతతో చెప్పాడు నైబర్ రామన్. హుటాహుటిగా బయలుదేరి, ఆటోలో త్వరగా హాస్పిటల్ చేరాడు. పిల్లల వార్డులో మూడో నంబర్ బెడ్ మీద నిద్ర పోతున్న నందితను చూశాడు. కంగారు చూపులతో పక్కనే కూర్చున్న శారద మూర్తిని చూడగానే కళ్ళనిండా నీళ్ళు చేసుకుంది.

"అరె ఎందుకు? నే నొచ్చానుగా." మూర్తి అన్నాడు.

"డాక్టర్ ఇప్పుడే వెళ్ళారు. సెలైన్ గ్లూకోసు ఎక్కించారు. బాగా నీరసించి పోయిందిట. ఆలస్యం చేస్తే కష్టమయ్యేది." శారద ఆదుర్దాగా చెబుతూంది. "మా అమ్మని వెంటనే రమ్మని టెలిగ్రాం ఇవ్వండి. తోడుగ ఉంటుంది."

"అలాగే. నీ వనవసరంగా కంగారు పడిపోకు."

"ఈ మందులు రాసిచ్చారు. వనల్ని కొనుక్కుని రమ్మన్నారు."

అందుకున్నాడు చీటీ మూర్తి.

• • •

"శారదా! ఇవిగో మందులు." అందించాడు మూర్తి.

"ఈ టిఫిన్‌లో అన్నం ఉంది. కూరలో కొంచెం ఉప్పు ఎక్కువ వేసినట్లున్నాను. కాస్త సర్దుకో." నవ్వుతూ అన్నాడు మూర్తి. మూర్తి యూనిఫారంలో ఉండటం కించిత్ అనుమానంగ చూసింది శారద.

"శారదా! బేబి ఈ రెండు రోజుల్లో చాలా మెరుగయినట్లుంది కదూ?"

శారద మాట్లాడలేదు.

"టెలిగ్రాం ఎప్పుడో ఇచ్చాను. మీ అమ్మ క్షణంలోనో, సగం లోనో వస్తుంది తప్పకుండా."

"అందువల్ల మీరు డ్యూటీకి వెళుతున్నారా?"తీక్షణంగా కళ్ళలోకి చూస్తూ అడిగింది శారద.

"వెళ్ళకపోతే ఎలా?" అమాయకంగా అడిగాడు మూర్తి.

శారద విస్తుపోయి చూసింది, అతని వంక.

"ఇటువంటి తరుణంలోకూడా మీరు డ్యూటీకి వెళ్ళ వలసిందేనా? మీరు చేసే నౌకరీతో ప్రభుత్వానికి ఎంత బాధ్యతో—భర్తగా నాకు, తండ్రిగా నందితకు ఈ సమయంలో అంతకంటే ఎక్కువ బాధ్యులు...అది గుర్తుంచుకోండి."

ఆమె మాటల్లో మూర్తిని జయించాలనే ప్రేమశక్తి ఉప్పొంగుతూంది. అసలే ఆజానుబాహుడు. అందులోను యూనిఫారంలో ఉన్న మూర్తి చాలా గంభీరంగ కనిపిస్తున్నాడు.

దూరాన్నుంచి టంగ్ టంగ్‌మంటూ ఆరు గంటలు వినిపిస్తున్నాయి. ఫాన్ నిర్విరామంగా తిరుగుతూంది. నర్సు వచ్చి కేస్ షీట్‌లో ఏదో వ్రాసింది. శారదకు టాబ్లెట్లు అందించింది.

**ఎస్. ఎస్. ఎస్. జవహర్‌లాల్**


నందితకు ప్రతి గంటకు ఒకటి వేయుమని చెప్పింది. నందిత మగతగా నిద్ర పోతూంది.

"ఏమిటా మాటలు అర్థం లేకుండా? డాక్టర్ చెప్పారు—నందితకు చాలా మెరుగని."

"అందుకని...డ్యూటీకి పరుగెత్తి వెళ్ళమన్నారా డాక్టర్ మిమ్మల్ని?"

"అదికాదు, శారదా! న న్నర్థం చేసుకో. సడన్‌గ సెల వెట్లా ఇస్తారు ఇప్పుడు? అందులోను జనరల్ మేనేజర్ ఇన్‌స్పెక్షన్. స్పెషల్ డ్యూటీలు. ఆఫీసర్లందరు ఈ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో సెలవు దొరకటం కష్టం."

శారద హృదయంఅంతర్గతంగాక్షోభించింది. తన భర్తది ఏమి జీవితం? కన్న




బిడ్డలకు చదువు సంధ్యలు స్వయంగా చూచుకోలేడు. భార్యా పిల్లల యోగక్షేమాలు అవసర సమయాల్లో ఆదుకోలేడు. జీవితంలో సగ భాగం పైనే రైలుబండ్లలోనే వారి బతుకు. ఎప్పటికి శుభోదయం. మూర్తి అటూ ఇటూ చూస్తున్న వాడల్లా ఒక్కసారిగా లేచాడు. జవాబు దొరికిన వాడిలా దృఢ నిశ్చయంతో సూటిగ చూశాడు. విద్యుక్త ధర్మాలను, విధి బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలి. అప్పుడే ఉద్యోగి తన వ్యక్తి వికాసానికి, స్వాతంత్రేచ్ఛకు సోపానాలు ఏర్పరుచుకున్న ధన్యు డవుతాడు. క్రమశిక్షణలే కార్మికుల సమస్యా పూరిత జీవితాలకు పరిష్కారాలు ప్రబోధిస్తాయి. డ్యూటీ ఫస్ట్ ఎవ్వెరిథింగ్ నెక్స్టు అన్న సిద్ధాంతంలో ఎంతటి మనోజ్ఞమైన త్యాగం ఇమిడి ఉంది.

మూర్తి శారద ముందుగా నుంచున్నాడు.

"విష్ యూ గుడ్‌లక్. మీ అమ్మ తప్పక వస్తుంది. నేను... నేను డ్యూటీకి వెళుతున్నాను."

వడివడిగ అడుగు లేసుకుంటూ వెళ్ళి పోతున్నాడు మూర్తి.

రెప్ప లార్పకుండ అలాగే చూస్తుండి పోయింది శారద.

• • •

"ఏమ్మా! మీ బేబీ చాలా బెటర్ లాగుందే." డాక్టర్ పరామర్శించాడు.

శారద పక్కమీంచి వినయంగా లేచి నుంచుంది.

డాక్టర్ బేబిని నిశితంగా పరీక్షిస్తున్నది. స్టెతస్కోప్ గిలిగింతలకు నందిత అటూ ఇటూ తిరుగుతూంది.

"మీ బేబీ పర్ఫెక్టు. రేపు డిశ్చార్జి చేస్తాను."

డాక్టరు వెళ్ళిన రెండు నిమిషాలకే పార్వతమ్మ పిన్ని, పక్క వాటాలో ఉండే రామన్ భార్య లత వచ్చారు.

"ఏం, పిన్నీ, అమ్మ రాలేదా?"

"లేదే, శారదా! అమ్మ ఒంట్లో బాగోలేదు. మీ తంతి చూసుకుని ఆదుర్దాగా నన్ను బయలుదేరతీశారు. దారి పొడుగునా అడ్డంకులే. ఇంటి కెళ్ళాను సరాసరి. హాస్పిటల్లో ఉన్నారని పాపం ఈ అమ్మాయి తీసుకొచ్చింది. అన్నట్లు బేబీ ఏది?" అంటూ అడిగింది.

"అయ్యోరామ...నా చిన్ని తల్లి! ఎంత చిక్కిపోయావే రివటలా. ఇదేం మాయదారిరోగమే." వాపోయింది పార్వతమ్మ. "ఇదెక్కడి మనిషే?భార్య పిల్లల్ని మించిన డ్యూటీ ఏమిటంటా పాడు

డ్యూటీ...చోద్యంకాకపోతే. రానీ నాలుగు మెంపోవ ఆడుగతా'' అంటూ వందిత ప్రక్కన జేరింది ప్రేమగా.

''నిజమేనండి. ఇటువంటప్పుడు మూర్తిగారు ఇక్కడుంటేనే బాగుండేది. అయినా పెలవిస్తారే! తీసుకోవలసింది. సెంవుఇవ్వకపోయినా...పరవాలేదు. మొన్న మా నా ఫ్రెంటబ్బాయి పెళ్ళి కెళ్ళాల్సి వస్తే మా వారు సెల వడిగారు. తిప్పి కొట్టారు. ఆయన తక్కువ వారా... 'మెడికల్ సిక్'గా అయిపోయారు. 'సిక్' గానే పెండ్లికి హాజరయ్యారు హాయిగా.''

లత మాట్లాడుతుంటే వింటోంది శారద

''సిక్కుగ మారిపోవడ మేమిటి? ఆదేమన్నా ఉపదేశమా, తల్లీ?''

''ఒంట్లో బాగుండక పోవటాన్ని సిక్ అంటారు. పిన్నీ!'' వివరించింది శారద.

''అసాధ్యులండీ మా వారు. అంతెం దుకు? టికెట్ కలక్టర్ రామన్ అంటే వూర్లో తెలియని వా రుండరు. కూరల మార్కెట్టు కెళ్ళండి. పద్దుబాబూ డబ్బం టారు. వ్యాపారస్థులకు పరేపం తలలో నాలికే. సినిమాహాళ్ళు, హోటళ్ళు, బట్టల షాపులు, క్లబ్బులు...ఎక్కడ కెళ్ళినా సాక్షాత్తు కలెక్టర్ గారి పలుకు బడంటే నమ్మండి. చేసే ఉద్యోగం ఏమిటీ మరి ... టికెట్ కలక్టరయ్యె!''

కళ్ళు త్రిప్పుకుంటూ శ్రీవారి పర పతిని చాటుతోంది లత.

అది అభ్యాసమో, అమాయకత్వమో తెలియటంలేదు శారదకు.

''టిక్కట్లంటుంటే గుర్తొస్తోంది'' పార్వతమ్మ అందుకుంది.

''నేను వచ్చేటప్పుడు పెద్ద మోసం జరిగిందే, తల్లీ! మన వూర్లో స్టేషన్‌కి ఆదరాబాదరా వచ్చేసరికి రైలుబయలుదేర బోయింది. టికెట్ కొనకుండ బండి ఎక్కకూడదు కదా. అందుకని బండిలో టికెట్ అడిగే ఆయన కనబడితే చెప్పొడు మాటిగాడు నన్ను ఎక్కిస్తూ. నా దగ్గర పది రూపాయలు తీసుకున్నాడు. టికెట్ వ్రాసిస్తాను, ఫర్వాలేదు కూర్చోండి అంటూ ప్రక్కపెట్టెకేసెళ్ళాడు. నాలుగు స్టేషనులు దాటినా అతగాడు నాకు టికెట్ రాసివ్వలేదు. దిగి అడగటానికి సరంజానూ ఉందాయె.''

నెత్తిమీద గుడ్డను సరిచేసుకుంది పార్వతమ్మ.

''ఏమయింది?'' కుతూహలంగా అడి గింది లత.

''అదేదో స్టేషనే, తల్లీ! బిలబిల మంటూ అమాంతంగా ఐదుగురు మా పెట్టెలో కెక్కి ప్రతి వాడిని టిక్కెట్ చూప మన్నారు. నిజం చెప్పొద్దూ! నాకు ఒళ్ళంతా చెమటలు పోసినయి. జరిగింది ఎలాగో చెప్పాను. వాళ్ళు చెవి నేసుకోలా. అదేదో జరుమానావాలంటూ ఇరవై పైచిలుకు కట్టమన్నారు. లేకపోతే జైల్లో పెడతా మన్నారమ్మా. అట్లా ఒక రిద్దరిచేత నా కళ్ళముందే కట్టించుకున్నారు కూడా.''

''ఆ పదిరూపాయలు తీసుకున్న వ్యక్తిని చూపించాల్సింది. పిన్నీ!'' జాలిగ అంది శారద.

''అతన్ని ఈడ్చుకొచ్చి నిజంకక్కిం చాల్సింది మీరు.'' సానుభూతిగా అంది లత.

''ఎలాగయితేనేం అతన్ని పట్టు కున్నాను, తల్లీ! కాని అతను మనిషికాదే. నిలువెల్లా విషం. అసలు నేనెవరో చూడ లే దన్నాడు. అంతేనమ్మా! ఈ ఏడు ఇద్రినాద్ యాత్రకని వుంచుకున్న పైకం లోంచి జరిమానా కట్టాను. రసీదు అప్పటికప్పుడే రాసిచ్చారు నాకు''. పార్వతమ్మ బాధగా చెప్పింది.

''స్క్వాడ్...అలాగే చెక్ చేస్తారు వాళ్ళు'' అంది తెలిసినదానిలా లత.

''ఏం పాడో! నా మీద ఇంత కనికర మైనా చూపలేదు.''

''పది రూపాయలు తీసుకొని మోసం చేశాడు వా డెవడో. అయినా పాపం మీలాంటి వాళ్ళను దగా చేయకపోతే, ఏ కాలో చెయ్యో విరగ్గొట్టుకుని బండ్లలో అడుక్కోకూడదూ అటు వంటి వాళ్ళు.'' కోపంతో వూగిపోతూ అంది లత.

శారద దిగులుగా చూస్తుండి పోయింది పార్వతమ్మను.

చిరునవ్వులు చిందిస్తూ, ఓపిక కూడగట్టుకుని లేచి కూర్చుంది వందిత బెడ్ మీద.

''నే వెళతానండీ. ఇల్లు తాళంపెట్టి వచ్చాను. వారు వచ్చేవేళయింది. నా కోసం ఇక్కడికే వస్తారు.''

లత అంటూ బయలుదేరబోవటం, రామన్ అక్కడకు రావటం చూడగానే అమాంతంగా లేచింది పార్వతమ్మ.

''ఏం నాయనా! చేసిన నిర్వాకం చాల్లేదా—ఇక్కడికి కూడ వచ్చావ్'' అంటూ విరుచుకు పడ్డది.

''ఈ మహానుభావుడేన్నే, తల్లీ, చెప్పింది.''

చెవుల కందని స్పీడులో అష్టకం ప్రారంభించింది.

శారద కళ్ళెర్రచేసి,రహస్యంగా చేయి నొక్కటంతోగాని పార్వతమ్మ ఆపలేదు.

రామన్ షాక్ నుంచి ఇంకా కోలుకో లేదు.

లత నోరు తెరుచుకుని విస్మయంగా చూస్తోంది.

''తొందరబడకు. ఎవరిని చూసి ఎవ రనుకుంటున్నావో, పిన్నీ! వీరు రామన్ గారు—లత భర్త'' అంది శారద.

పార్వతమ్మ తెలివిలోకొచ్చి, నిదాన పడ్డది.

లత అహం దెబ్బతింది. మాట లేకుండా తలొంచుకుని అక్కడ నుంచి కదిలింది బరువుగా రామన్‌తో.

''దేవుని మీద ఒట్టే, శారదా! నమ్ము. సాక్షాత్తూ ఇతగాడేనే నా దగ్గర పది రూపాయలు తీసుకుని దగా చేసింది.''

''పోనీలే, పిన్నీ! పదితడవ లనకే. వాళ్ళు ఫీలవుతారు. అసహ్యంగా ఉంటుంది ఎవరయినా వింటే.''

సర్దిచెప్పింది శారద.

కాని, శారద మస్తిష్కంలో ఘాటుగ నాటుకుపోయింది ఈ సంఘటన.

రామన్! నైతికంగా ఎంత దిగజారి పోతున్నాడు పాపం. శారద హృదయం ఒక్కసారిగ మూర్తిని కలవరించింది. అతని నీతి నిజాయితీలను ఆరాధించింది. అతని అడుగులలో అడుగులేసుకుంటూ ప్రోత్సాహ మివ్వటానికి ఉత్సాహపడు తోంది. పేరాశల సరిగమలు పల్లవిస్తూ, కరెన్సీల గూళ్ళు కట్టుకుని ఆనందాలు అనుభవిస్తు ఉండేది కొందరైతే— ఆశయాల సంపెగల మృదు మధుర సువాసనలు వెదజల్లుతూ జీవిత సంతృప్తులు పండించుకునేది మరి కొందరు. అందరూ అనిపించుకునేది— ఉద్యోగస్థులే!

ఆశ్చర్యం! వారిలో వారికి ఎన్ని మాన సిక తేడాలు. వారికి వారికి మధ్య ఎంత పెద్ద విలువల అగాధం. ఆనందపు తన 'నేటిని', పరుల 'రేపటి'కోసం కర్తవ్యం, త్యాగంతో చేసే జవానులా వెలిగి పోతున్నాడు టికెట్ కలక్టర్ కృష్ణ మూర్తి శ్రీమతి శారద హృదిలో. అలుము కున్న చీకట్లను వెదజల్లుతూ ఆ హాలు లోని విద్యుద్దీపాలు ఒక్కసారిగా తళుక్కు మన్నాయి. *

